
www.prajasakti.com

ప్రజాశక్తి

5

సోమవారం 11 మార్చి 2024




తిరుపతి

ఏనుగుల గుంపు హల్‌చల్

ప్రజాశక్తి- ఐరాల: చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం ఐరాల మండలం వేదగిరివారిపల్లి పంచాయతీ చుక్కావారిపల్లి గ్రామంలో 19 ఏనుగుల గుంపు హల్‌చల్ చేస్తోంది. గత రెండు రోజులుగా గ్రామశివారుల్లోని పంటపొలాల్లోని పంటలను తిని తొక్కి నాశనం చేస్తున్నాయి. గ్రామానికి చెందిన రైతులకు చెందిన అరటి, మామిడి, చెరకు పంటలతో పాటు అటవీ ప్రాంతం చుట్టూ ఉన్న సోలార్ ఫెన్సింగ్‌ను ధ్వంసం చేశాయి. ఏనుగుల వలన చేతికందిన పంట నష్టపోతున్నామని, దాదాపుగా 3లక్షల మేర నష్టం వచ్చిందని తెలిపారు. ఏనుగుల భారీ సంఖ్యలో ఉండటంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామ పరిసర అటవీ ప్రాంతంలో ఏనుగుల గుంపు తిష్ట వేయడంతో అవి ఎప్పుడు పంటలపై, తమ దాడి చేస్తాయో అని ఆందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు వెంటనే స్పందించి ఏనుగులను అడవిలో తరిమేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. అంతేకాకుండా అటవీ ప్రాంతంలో ఏనుగులు ధ్వంసం చేసిన సోలార్ ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేసి ఆదుకోవాలని గ్రామస్తులు, రైతులు తెలిపారు.

తిరుపతిలో సైకిల్ గుర్తు కనపడదు..

- 41 ఏళ్ల తర్వాత పోటీ నుంచి తప్పుకున్న టిడిపి..!
- జనసేనలోకి వలసలు



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

సార్వత్రిక ఎన్నికల్లో తిరుపతిలో టిడిపి గుర్తు సైకిల్ కనపడదు.. ఇటు తిరుపతి అసెంబ్లీలోనూ తిరుపతి పార్లమెంటు లోనూ సైకిల్ బొమ్మ ఉండదు. బిజెపి, జనసేన, టిడిపి పొత్తులో భాగంగా తిరుపతి సీటును జనసేనకు కేటాయించారు.. తిరుపతి పార్లమెంటులో ఈ స్థానాన్ని బిజెపికి కేటాయించారు. రెండు చోట్ల టిడిపి అభ్యర్థులు నామినేషన్ వేయనందున ఈ ఎన్నికల్లో సైకిల్ గుర్తు కనపడదు. 1983లో మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత టిడిపి అధికారులకు వచ్చింది. ఎన్టీ రామారావు సెంటిమెంట్‌గా తిరుపతి, గుడివాడలో పోటీ చేసి రెండు చోట్ల గెలుపొందారు. తిరుపతి స్థానానికి రాజీనామా చేసి గుడివాడ ఉంచుకుని ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత ఉప ఎన్నికల్లో కత్తుల శ్యామలమ్మ పోటీ చేసి విజయం సాధించారు.

1989లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా మబ్బు రామిరెడ్డి ఉన్నారు. 1994లో ఆవుల మోహన్ ఎమ్మెల్యేగా టిడిపి నుంచి విజయ బావుట ఎగరవేశారు. 1999లో చదలవాడ కృష్ణమూర్తి కాంగ్రెస్ పై పోటీ చేసి అసెంబ్లీకి వెళ్లారు. 2004లో కాంగ్రెస్ అభ్యర్థి ఎం.వెంకట రమణతో పోటీపడి ఎన్‌వి.ప్రసాద్ టిడిపి అభ్యర్థి ఓడిపోయారు. 2009లో కొణిదెల చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ స్థాపించి పాలకొల్లు, తిరుపతి నుంచి పోటీచేసి గెలుపొందారు. పాలకొల్లులో ఓడిపోయారు. 2012 మధ్యంతర ఎన్నికల్లో వైసీపీ నుంచి భూమన కరుణాకర్ రెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. టిడిపి అభ్యర్థి చదలవాడ కృష్ణమూర్తి మూడో స్థానంలో నిలిచారు. 2014 ఎన్నికల్లో టిడిపి నుంచి ఎం వెంకటరమణ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆయన మరణాంతరం మధ్యంతర ఎన్నికల్లో ఆయన సతీమణి సుగుణమ్మ టిడిపి నుంచి పోటీ చేసి అసెంబ్లీకి వెళ్లారు. 2019 ఎన్నికల్లో టిడిపి నుంచి సుగుణమ్మ ఎమ్మెల్యేగా పోటీ చేశారు. 700 చిల్లర ఓట్ల తేడాతో ఆమె ఓడిపోయి భూమన కరుణాకర్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి, టిడిపి, జనసేనలు ఒకే కూటమిగా నిలిచాయి. పొత్తులో భాగంగా తిరుపతి అసెంబ్లీ జనసేనకు, తిరుపతి పార్లమెంటు బిజెపికి కేటాయింపులు దాదాపు జరిగిపోయాయి.. ఇక అధికార ప్రకటన తరువాయి.. టిడిపి 41 ఏళ్ల చరిత్రలో మొదటిసారిగా తిరుపతి అసెంబ్లీ పోటీ నుంచి తప్పుకుంటుంది. 1999లో టిడిపి బిజెపి పొత్తుల భాగంగా అప్పుడు తిరుపతి పార్లమెంటుకు బిజెపి కేటాయించారు. తిరుపతి ఎంపీగా బిజెపి అభ్యర్థిగా గెలుపొందారు.. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తిరుపతి పార్లమెంటు తెలుగు అసెంబ్లీ ఈవీఎంలో సైకిల్ గుర్తు కనిపించదు

జనసేనలోకి వలసలు

తిరుపతిలో టిడిపి ఖాళీ అవుతుందన్న ప్రచారం జరుగుతోంది... ప్రస్తుత రాజకీయ పరిణామాలు చూస్తే అలానే అనిపిస్తోంది... టిడిపి తిరుపతి నియోజకవర్గం ఇన్చార్జి సుగుణమ్మ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి జనసేనలో టికెట్ ఇస్తే ఎమ్మెల్యేగా పోటీ చేస్తామని బహిరంగంగానే ప్రకటించారు. మరోవైపు టిడిపి నేతలు వూకా విజయ్ కుమార్, జేబీ శ్రీనివాస్‌లు కూడా జనసేన వైపు చూస్తున్నారు.. తమకు పవన్ కళ్యాణ్ టిక్కెట్ ఇస్తే గెలిచి తీరుతామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.. తిరుపతి పార్లమెంటు నియోజకవర్గం అధ్యక్షులు నరసింహ యాదవ్‌కి టికెట్ రాకపోవడంతో అసంతృప్తితో ఉన్నారు.. తిరుపతిలో బీసీలు ఎక్కువగా ఉన్నారని.. కాబట్టి తనకే టికెట్ ఇవ్వాలని పట్టుబడి మరీ కూర్చున్నారు.. టిడిపి క్యాడర్ దుంపూరు భాస్కర్ యాదవ్, బుల్లెట్ రమణ, శంకర్ నారాయణ తదితరులు సుగుణమ్మ దారే మాదారి అంటున్నారు..

తిరుపతిలో టిడిపిలోని ప్రధాన నాయకత్వం జనసేన వైపు వలసలు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.. తిరుపతిలో టిడిపి గెలిస్తే రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందన్న సెంటిమెంటూ.. ఇది... ఇక వైసిపి అభ్యర్థి భూమన అభినయ్ ఇప్పటికే ప్రచారంలో దూసుకుపోతున్నారు.. 25 ఏళ్ల ముందే అభివృద్ధి తమ ప్రభుత్వం చేశామని తమకు ఓటు వేయండి అని ప్రచారం చేస్తున్నారు.. ఎంత ఖర్చు అయినా సరే ఓటర్లను ప్రలోభాలు పెట్టేందుకు వైసీపీ సిద్ధమవుతుంది.. అయితే బిజెపి, జనసేన, టిడిపి కూటములు ఇంతవరకు అభ్యర్థులను ప్రకటించలేదు.. తిరుపతి అసెంబ్లీ జనసేనకు, తిరుపతి పార్లమెంటు బిజెపికి కేటాయిస్తే తిరుపతిలో టిడిపికి భవిష్యత్తు ఉండదని రాజకీయ విశ్లేషకుల భావన.. పొత్తు నేపథ్యంలో చేతులారా టిడిపి తిరుపతిని కోల్పోనుంది..

అధికార నందిపై ఆదిదేవుని అభయం

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా 8వ రోజైన ఆదివారం ఉదయం ఆదిదేవుడు అధికార నందిపై పురవిహారం చేశారు. ఆదిదేవుని దేవేరి జ్ఞానప్రసూనాంబదేవి కామధేనువుపై ఆయనను అనుసరించారు. అంతకు మునుపు అలంకార మండపంలో గంగాభవానీ సమేత శ్రీకాళహస్తీశ్వరుడు, జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. ఆలయ పురోహితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం గంగాభవానీ సమేత శ్రీకాళహస్తీశ్వరుని అధికార నందిపై పైనా... జ్ఞానప్రసూనాంబ అమ్మవారిని కామధేనువు పైనా అధిష్టించి పురవిహారానికి తీసుకువచ్చారు. మూషిక వాహనంపై వినాయకుడు, చప్పరాలపై శ్రీవల్లీ, దేవసేన సమేత కుమారస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప స్వామి, అమ్మవార్లను అనుసరించారు. మంగళవాయిద్యాలు, మేళ తాళాల మధ్య పురవిహారానికి వచ్చిన ఆదిదంపతులను దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. కర్పూర హారతుల సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు సభాపతి కల్యాణం

శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సాలను పురస్కరించుకుని 9రోజైన సోమవారం సభాపతి కల్యాణం నిర్వహించనున్నారు. సభాపతిగా పిలువబడే నటరాజస్వామికి శివకామసుందరితో కల్యాణం నిర్వహిస్తారు. ఈ కల్యాణం ఆలయ ప్రాంగణంలోని 16కాళ్లు మండపం వద్ద జరుగుతుంది. ఇక సభాపతి కల్యాణం జరిగే రాత్రిని ఆనందరాత్రిగా వ్యవహరిస్తారు. నాగభూషణుడు నటరాజుగా ఆనంద తాండవం చేస్తాడు. నారద తుంబరుడు, సకల యక్ష, గాంధర్వ గానంతో, వాయిద్యఘోషలతో ఆనందరాత్రి వేళ కైలాసగిరులు ప్రతిధ్వనించనున్నాయి.

దక్షిణ కైలాసానికి కల్యాణ శోభ

దక్షిణ కైలాసానికి కల్యాణ శోభ సంతరించుకుంది. తిరుమల తిరుపతి దేవస్థానం వారు అందజేసిన పట్టు వస్త్రాలను ధరించి గంగాభవానీ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి గజ వాహనం పైనా... జ్ఞానప్రసూనాంబదేవి సింహ వాహనం పైనా అధిరోహించి పెండ్లి మండపానికి బయలు దేరారు. ఆదిదంపతుల కల్యాణం కోసం పెండ్లిమండపం ముస్తాబైంది. ఈకల్యాణ వేడుకలు తిలకించేందుకు వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సోమవారం వేకువ జామున 3గంటల ప్రాంతంలో ఆది దంపతుల కల్యాణం నిర్వహించాలని ఆలయ పండితులు ముహూర్తం నిర్ణయించారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి గంగాభవానీ సమేత పరమశివుడు, జ్ఞానప్రసూనాంబ అమ్మవారి ఉత్సవ మూర్తులను అలంకార మండపంలో స్వర్ణాహరణాలతో అలంకరించారు. ఆలయ పురోహితులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం రాత్రి 11గంటల ప్రాంతంలో గంగాభవానీ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని గజ వాహనం పైనా... జ్ఞానప్రసూనాంబ అమ్మవారిని సింహ వాహనం పైనా అధిష్టింప చేసి పెండ్లిమండపం వద్దకు తీసుకొచ్చారు. స్వర్ణాభరణాలు ధరించి... గజ. సింహ వాహనాలపై ఊరేగుతూ విద్యుత్ దీప కాంతుల వెలుగుల్లో ధగధగ లాడుతున్న శివపార్వతులను చూసి భక్తులు పరవశించి పోయారు. మంగళ వాయిద్యాలు, మేళ తాళాలు మోగుతుండగా... పదాతి దళాలు ముందు నడుస్తుండగా స్వామి, అమ్మవార్లు పెండ్లిమండపం వద్దకు చేరుకున్నారు. అర్ధరాత్రి తరువాత శివపార్వతుల పెళ్లితంతు ప్రారంభమైంది. స్వామి, అమ్మవార్ల కల్యాణ ఘడియలో పెళ్లి చేసుకునేందుకు పలు జంటలు తరలి వచ్చాయి. కాగా వందల సంవత్సరాలుగా ఈ కల్యాణ మహోత్సవానికి ఉభయదారులుగా కైకాల వంశస్తులే ఉంటూ వస్తున్నారు. ఈ వంశానికి చెందిన తిరుపతి జిల్లా చెంబేడు గ్రామంతో పాటు 14 గ్రామాలకు చెందిన ప్రజలు ఉభయదారులు. అలాగే తమిళనాడులోని తిరుత్తణి ప్రాంతానికి సెంగుందర్, కులవెళ్తుత్తూరు, మరబినార్ కులాలకు చెందిన వారు అమ్మవారి తరపున ఉభయ దారులుగా ఉంటున్నారు.



భక్తులకు అన్నదానం

మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం తెల్లవారుజామున జరిగే ఆదిదంపతుల కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు విచ్చేసిన భక్తులకు స్థానిక నగరివీధిలో వాయు లింగేశ్వర మొబైల్ షాప్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి అన్నదానం చేశారు. ఆదిదంపతుల కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తుల ఆకలిని తీర్చేందుకు మొబైల్ షాప్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేయడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాహిర్, సురేంద్ర యాదవ్ తెలిపారు.

శ్రీకాళహస్తీశ్వరునికి టీటీడీ పట్టువస్త్రాలు



శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆది దంపతుల కల్యాణం కోసం ఆదివారం తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలు సమర్పించారు. తిరుమల తిరుపతి దేవస్థానం కార్య నిర్వహణాధికారి ఏవీ ధర్మారెడ్డి ఈ పట్టువస్త్రాలు తీసుకువచ్చారు. పట్టువస్త్రాలను తీసుకువచ్చిన ధర్మారెడ్డికి ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్వీ నాగేశ్వరరావు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. మణికంఠ ఆలయం వద్ద నుంచి పట్టు వస్త్రాలను మంగళ వాయిద్యాలు, మేళ తాళాల మధ్య వేడుకగా తీసుకెళ్లారు. అలంకార మండపంలో ఈ పట్టువస్త్రాలను వేదపండితులకు శాస్త్రోక్తంగా అందజేశారు. అనంతరం ఏవీ ధర్మారెడ్డి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. కాగా శ్రీకాళహస్తీశ్వరుడు, జ్ఞానప్రసూనాంబ అమ్మవారి కల్యాణం కోసం కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి, విజయవాడ కనకదుర్గ, శ్రీశైలం మల్లిఖార్జున స్వామి ఆలయాల ఆధ్వర్యంలో కూడా పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ అధికారులు వీరికి సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి పట్టు వస్త్రాలను స్వీకరించారు. అనంతరం దర్శన ఏర్పాట్లు చేశారు.

సాంప్రదాయ వైద్యాన్ని ప్రభుత్వం ప్రోత్సహించాలి

ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఉమామహేశ్వరరావు
ఆక్యుపంక్చర్ శిబిరం ముగింపు సభలో వక్తలు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

సాంప్రదాయ వైద్యాన్ని ప్రభుత్వాలు ప్రోత్సహించాలని, ఆగిపోయిన పరిశోధనలను పునఃప్రారంభించాలని ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఉమామహేశ్వరరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల ఒకటో తేదీ నుంచి పది రోజులు పాటు నిర్వహించిన ఆక్యుపంక్చర్ ఉచిత వైద్యశిబిరం ముగింపు సభలో ఉమామహేశ్వర రావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. డాక్టర్ ఎమ్మెస్ బాలాజీ ఆక్యుపంక్చరు వైద్యాన్ని తిరుపతిలో విస్తృత పరచడానికి, పేదలకు సేవచేయడానికి ఓ సాధనంగా ఎంచుకొని చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని, గత పది రోజులుగా నిర్వహించిన వైద్యశిబిరంలో పెద్దఎత్తున పేదలు తరలివచ్చి దీర్ఘకాలికంగా ఉన్న జబ్బులను నయం చేసుకున్నారని అన్నారు. తిరుపతి నగరంలో ఆక్యుపంక్చర్ వైద్యాన్ని విస్తృత పరచడానికి కృషి చేస్తున్న డాక్టర్ ఎంఎస్ బాలాజీని ఆయన అభినందించారు. గత పది రోజులుగా వైద్యశిబిరాన్ని జయప్రదంగా నిర్వహించిన డాక్టర్ ఎమ్మెస్ బాలాజీ వారి సిబ్బందిని ఈ సందర్భంగా ఘనంగా సన్మానించి నిర్వాహకులు అభినందనలు తెలిపారు. డాక్టర్ ఎమ్మెస్ బాలాజీ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాన్ని కొనసాగిస్తామని ప్రతి మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వేమన విజ్ఞాన కేంద్రంలో జరుగుతుందని తెలిపారు. తాము అనుకున్న దానికంటే ఎక్కువగా రోగులు తరలివచ్చారని, లక్షల రూపాయలు వైద్యం కోసం ఖర్చు చేసిన అనేకమంది రోగులు తాము నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని స్వస్థత పొందారని తెలిపారు. ప్రజలు, నేతలు, నిర్వాహకుల విజ్ఞప్తి మేరకు తాను ఉచిత వైద్యశిబిరాన్ని కొనసాగిస్తానని ఆదరించిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కందారపు మురళి, వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఆంధ్రజ్యోతి సీనియర్ అసిస్టెంట్ మేనేజర్ ఉమామహేశ్వరరావు

వేసవి నేపథ్యంలో..

ఇంటర్వ్యూ...

జంతు రక్షణ చర్యలు ప్రారంభించాం..!

- సందర్శకులకు అన్ని రకాల సదుపాయాలు..
- జూ క్యూరేటర్ సెల్వంతో ప్రజాశక్తి ముఖాముఖి



ప్రజాశక్తి- తిరుపతి (మంగళం):

శ్రీ వెంకటేశ్వర జంతు ప్రదర్శనశాలలో సందర్శనకు వచ్చే వారికి అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామని జూ క్యూరేటర్ సెల్వం తెలిపారు. వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకొని శ్రీవెంకటేశ్వర జంతు ప్రదర్శనశాలలో జంతువుల రక్షణకు ఎటువంటి చర్యలు చేపట్టారన్న అంశాలను ప్రజాశక్తితో ముఖాముఖిలో వెల్లడించారు.

ప్రజాశక్తి: ప్రస్తుతం జూ లో ఎన్ని రకాల జంతువులు ఉన్నాయి?.

అధికారి: ప్రస్తుతం 85 రకాలకు చెందిన వన్యమృగాలు, పక్షులు, పాములు వంటివి 1100 ఉన్నాయి. ప్రతిరోజు జూ సిబ్బంది వాటికి ఏర్పాటు చేసిన నివాస ప్రాంతాల వద్దకు వెళ్లి వాటి స్థితిగతులను పరిశీలించడం జరుగుతుంది. ఏదైనా అనారోగ్యం గుర్తించిన వెంటనే సంబంధిత ప్రాణిని వెటర్నరీ వైద్యులు చేత చికిత్స చేయిస్తాము.

ప్రజాశక్తి: జూ లో సీసీ కెమెరాల పరిరక్షణ ఎలా ఉంది?.

అధికారి: జూ లో గతంలో 60 సీసీ కెమెరాలతో జంతువుల సంరక్షణ కేంద్రాల వద్ద నిఘా ఏర్పాటు చేశాము. కానీ సందర్శకుల రక్షణలో భాగంగా మరిన్ని సీసీ కెమెరాలు అవసరమని గుర్తించి మరో 25 కెమెరాలను అదనంగా జూ లోని వివిధ ప్రాంతాల్లో వాటిని అమర్చడం జరుగుతుంది. జూ లో అమర్చిన సీసీ కెమెరాల వీడియోలను రెండు మానిటరింగ్ గదులను ఏర్పాటు చేసి వాటి ద్వారా పర్యవేక్షణ చేస్తున్నాము.

ప్రజాశక్తి: వేసవి దృష్ట్యా జంతు సంరక్షణ చర్యలను వివరించండి...?

అధికారి: ఈసారి వేసవిని దృష్టిలో ఉంచుకొని శ్రీవెంకటేశ్వర జంతు ప్రదర్శనశాలలో ఉన్న జంతువుల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నాము. ఎండ వేడి నుండి ఉపసమనం కోసం స్ప్రింక్లర్స్, వట్టివేర్లు కట్టలు, కూలర్స్, సాసర్ ఫీట్స్, కూల్ పెయింట్, ఎగ్జాస్ట్ ఫ్యాన్లు, గ్రీన్ మ్యాట్స్ వంటివి జంతు సంరక్షణ కేంద్రాల వద్ద ఏర్పాటు చేయడానికి పనులు ప్రారంభించాం. అదేవిధంగా జంతువులకు అందించే ఆహారంలోనూ వేసవిలో మార్పులు చేస్తాం. ప్రాణుల శరీర ఉష్ణోగ్రత అదుపులో ఉండడానికి అవసరమైన ఆహారాన్ని అందిస్తాం.

ప్రజాశక్తి: జూ వార్షిక బడ్జెట్ ఎంత?.

అధికారి: జూ నిర్వహణకు ఏడాదికి దాదాపు పది కోట్ల రూపాయల ఖర్చు చేయడం జరుగుతుంది. ఇందులోనే జూ నిర్వహణ, సిబ్బందికి జీతభత్యాలు, విద్యుత్ ఛార్జీలు, జంతువులకు ఇచ్చే ఆహారం వంటివి ఉంటాయి.

ప్రజాశక్తి: సెంట్రల్ జూ అథారిటీ నుండి ఏదైనా నిధులు వస్తాయా?

అధికారి: జూ లో రిస్క్యూ ప్రాణులు నిర్వహణ కోసం ప్రతి సంవత్సరం రూ.60లక్షలు సెంట్రల్ జూ అథారిటీ వారు అందించడం జరుగుతుంది. వార్షిక బడ్జెట్‌తో కలుపుకొని 10 కోట్ల 60 లక్షలతో జూ నిర్వహణ సాగుతోంది.

ప్రజాశక్తి: నీటి సమస్య ఉందా?.

అధికారి: ప్రస్తుతం జూలో ఎటువంటి నీటి కొరత లేదు. జూ నిర్వహణకు కళ్యాణీ డాం నీటితోపాటు జూ లోపల బోర్లను ఏర్పాటు చేసుకున్నాం. వీటితో జూలో పచ్చదనం నిర్వహణకు, జంతువులకు తగినంత నీటి సదుపాయం ఉంది.

ప్రజాశక్తి: సందర్శకుల రక్షణకు ఎటువంటి చర్యలు చేపట్టారు..?

అధికారి: గత అనుభవాల దృష్ట్యా సందర్శకుల రక్షణకు మరిన్ని రక్షణ చర్యలను తీసుకుంటున్నాం. అడవితో కలిపి ఉన్న జూ పూర్తిస్థాయి రక్షణ కోసం ఇప్పటికే రెండు మూడు చోట్ల పెద్ద పార్టీ గోడలను నిర్మించాము. రోడ్డు మార్గం వైపు కూడా నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశాము.

తుంగలో తొక్కిన సమయపాలన

- ఎస్వీయూలో విధులకు హాజరుకాని సిబ్బంది
- మధ్యాహ్నం అయితే ఆఫీసుల్లో కనిపించని అధికారులు
- నిర్లక్ష్యపు అధికారులపై పూర్తిస్థాయి చర్యలు ఎక్కడ ..?



ప్రజాశక్తి -క్యాంపస్: శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో బోధన, బోధనేతర సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కాలేదని విద్యార్థి సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా అకాడమిక్, ఫైనాన్స్ విభాగాల్లో, కొన్ని శాఖావిభాగాలలో బోధన, బోధనేతర సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కాలేదని తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా పరిపాలన భవనంలోని జీతాలను విడుదల చేసే ఫైనాన్షియల్ ఆఫీసర్ మధ్యాహ్న సమయంలో అసలు విధులకు హాజరు కారని అపవాదు ఉంది. బోధన, టైం స్కేల్, ఎన్ఎంఆర్, శాశ్వత ఉద్యోగులకు సకాలంలో జీతాలు అందాలి అంటే ఫైనాన్షియల్ ఆఫీసర్ సమయపాలన కచ్చితంగా పాటించాలని లేనిపక్షంలో ఉద్యోగులు తీవ్రఇబ్బందులు పడుతున్నారని విద్యార్థి, ఉద్యోగ సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. అయితే పరిపాలన భవనం కొన్ని విభాగాలలో ముఖ్యంగా ఇంజనీరింగ్ విభాగాలలో బోధన, బోధనేతర సిబ్బంది మధ్యాహ్న సమయాల్లో అసలు విధులకు హాజరు కాలేదని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఎస్వీయూ ఇంజనీరింగ్ కళాశాల అంటే ప్రపంచంలోనే ప్రత్యేకమైన స్థానం కలిగి ఉందని గత ఐదు సంవత్సరాలుగా సరైన అధ్యాపకులు లేక, అధ్యాపకులు సమయం పాలన పాటించక దాని ప్రతిష్ట కనుమరుగవుతుందని విద్యార్థి సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. వర్సిటీలోని వివిధ కళాశాల సముదాయాలలో, వసతి గృహాలలో సరైన శానిటేషన్, మురుగునీటి కాలువ విధానం పూర్తిగా అడుగంటు పోయిందని విద్యార్థి సంఘాల నేతలు ఆరోపించారు. ప్రస్తుతం ఉన్న అధికారులు వివిధ విభాగాల పర్యవేక్షణ ద్వారా విధులకు హాజరు కాని సిబ్బందిపై పూర్తిస్థాయిలో క్రమశిక్షణ చర్యలు తీసుకుంటే తప్ప వర్సిటీని అభివృద్ధి పథంలో తీసుకునేందుకు సాధ్యం కాదని మేధావులు, ఆచార్యులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సమయపాలన పాటించని అధికారులు అధ్యాపకులపై కొరడా జులిపిస్తారని ఆశిద్దాం. నిత్యం పరిపాలన భవనానికి కొన్ని వందల సంఖ్యలో విద్యార్థులు సర్టిఫికెట్లు తీసుకోవడానికి వస్తుంటారు. వాటి జిరాక్స్, నకలు తీసుకోవడానికి కనీసం వర్సిటీలో జిరాక్స్ సెంటర్ ఒకటి కూడా లేకపోవడం దారుణమని విద్యార్థి సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో సర్టిఫికెట్ కోసం వివిధ రకాలుగా వివిధ వర్గాలుగా విద్యార్థులను అనేకవిధాలుగా ఇబ్బంది పెట్టి డబ్బులు తీసుకునేందుకు ప్రస్తుత విసి అక్రమాలకు అడ్డుకట్ట వేసి, ఆన్లైన్ కంప్యూటర్ లో చలానా పద్ధతిని తీసుకురావడం పట్ల విద్యార్థి సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అత్యాచారాలకు నిలయం మోడీ ప్రభుత్వం

- పని చేసే చోట మహిలలకు రక్షణ లేదు..
- దిశ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి..
- ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మీ

ప్రజాశక్తి- తిరుపతిటౌన్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక యశోదానగర్‌లో వేమన విజ్ఞాన కేంద్రంలో సిఐటియు, ఐద్వా, యుటిఎఫ్ ఆధ్వర్యంలో సభ జరిగింది. ఈ సభలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, ఐద్వా జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.సాయిలక్ష్మి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పద్మజ మాట్లాడారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్త్రీలకు రక్షణ కరువైందని, అనేక ఘటనలు రుజువుతుందని అన్నారు. కాశ్మీర్‌లో ఆసిఫా ఉన్నావ్ ఘటనలో బాధితులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం దోషుల పక్షాన నిలబడిందని అన్నారు. అలాగే మణిపూర్‌లో మహిళల్ని నగ్నంగా ఊరేగించినా ప్రధానీ కనీసం వారి గురించి ఊసైనా ఎత్తలేదు.. ఈ దేశానికి పథకాలు సాధించిన రెజ్లర్లు తమపై లైంగిక వేధింపులకు మంత్రి బ్రిజిభూషణ్ సింగ్ పాల్పడ్డాడని ఆందోళన చేసిన దోషుల్ని శిక్షించలేని లేదని, భేటీ బచావో బేటి పడావో అంటూ నినాదాలు ఇచ్చినంత మాత్రాన మహిళలకు రక్షణ ఉంటుందని ప్రశ్నించారు? అంతేకాకుండా నేడు మహిళలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని అందులో ప్రధానంగా మహిళలు పనిచేసే చోట లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదని, 90 శాతం మంది మహిళలు ఉద్యోగ భద్రత లేక అభద్రతాభావంతో ఉన్నారని 52శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారని 42శాతం మంది చిన్నపిల్లలు ఆకలితో చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి మాసుపల్లి జయంతి అధ్యక్షత వహించగా అంగన్వాడీ రాష్ట్ర కోశాధికారి వాణిశ్రీ, శ్రామిక మహిళా కన్వీనర్ లక్ష్మి, టిటిడి యూనియన్ నాయకురాలు ఆదిలక్ష్మి, నారిబేరి అవార్డు గ్రహీత రాధారాణి, బుజ్జి పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మీ

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: వడమాలపేట మండలంలోని ఎస్వీ పురం పద్మనాభ డంపింగ్ యార్డు వద్దకు సీసీ రోడ్డు నిర్మాణానికి ఆదివారం మంత్రి రోజా సోదరులు రాంప్రసాద్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ రూ.26లక్షలతో సీసీరోడ్డును నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తుడా అధికారులు, నాయకులు సురేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-బాలాయపల్లి: పెళ్లకూరు చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు నిర్వాహకులు తెలిపారు. తిరుపతి ఎస్వీ అరవింద నేత్రాలయ వారి సహకారంతో మండలం కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మేనేజింగ్ డైరెక్టర్ చాగణం గౌరిశంకర్, సీతవో సీతారామ్ నాయుడు మాట్లాడుతూ కంటి ఆరోగ్య సమస్యలకు సీనియర్ వైద్య నిపుణులైన అనుభవం గల స్పెషలిస్ట్ డాక్టర్ల ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు, తగు సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. శిబిరంలో 200మందికి పరీక్షలను నిర్వహించగా 70మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 60 మందికి కంటి అద్దాలు, 40మందికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఏఓ కృష్ణ గఫ్జ్, అరవింద్ నేత్రాలయ సిబ్బంది జీవన్ తదితరులు పాల్గొన్నారు.

కోటేశ్వరరావుకు సిఐటియు నివాళి



ప్రజాశక్తి-తిరుపతిటౌన్: తిరుపతికి చెందిన ఆదర్శ వివాహ వేదిక వ్యవస్థాపకులు కోటేశ్వరరావు మృతికి సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి నివాళులర్పించారు. పాకాల సమీపంలోని ఉప్పరపల్లి గ్రామంలో కోటేశ్వరరావు మృతదేహానికి సిఐటియు నేత మురళి పూలమాలవేసి సంతాపం తెలియజేశారు. ఆయన కుటుంబీకులను కలిసి సానుభూతిని తెలియజేశారు. కోటేశ్వరరావుకు నివాళులర్పించిన వారిలో వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున, సిఐటియు నేత నాగ వెంకటేష్, అర్జున్, రచయిత గోవిందస్వామి తదితరులు ఉన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి సావిత్రిబాయి పూలే



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐద్వా నాయకులు

ప్రజాశక్తి-రేణిగుంట: అణగారిన వర్గాలకు ఆశాజ్యోతి సావిత్రిబాయి పూలే అని ఐద్వా, సిఐటియు నాయకులు అన్నారు. ఆదివారం రేణిగుంటలోని పుచ్చలపల్లి సుందరయ్య కార్యాలయంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం, సావిత్రిబాయి పూలే వర్ధంతిని జరుపుకొన్నారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రేణిగుంట ఐద్వా మండల కార్యదర్శి లక్ష్మి, మాజీ వార్డు సభ్యులు ఈశ్వరమ్మ, సత్య శ్రీ పాల్గొని ఉపన్యాసం ఇచ్చారు. వారు మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం ఎంపీటీసీ సభ్యులు ఎన్.రాజేశ్వరి, ఐద్వా ... 33శాతం ఆర్థిక సమానత్వం చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ సాధన కోసం మహిళలు ఉద్యమించాలని, మహిళలపై అత్యాచారాల నివారణ కోసం మహిళలందరూ ఐక్యంగా ఉద్యమించాలని, సావిత్రిబాయి పూలే బాటలో ప్రతి మహిళ ముందుకు నడుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో దీప, మునిరాజమ్మ, రైల్వే క్లీనింగ్ వర్కర్స్ నాయకులు మునిలక్ష్మి, అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం సామాజిక బాధ్యత



రక్తదానం చేస్తున్న దాతలు

ప్రజాశక్తి-గూడూరుటౌన్: రక్తదానం అందరి సామాజిక బాధ్యత అని మాజీ రోటరీ క్లబ్ వెస్ట్ గూడూరు అధ్యక్షులు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోటరీ క్లబ్ వెస్ట్ గూడూరు ఆధ్వర్యంలో ఎస్ఎల్వీఎన్ బాబు సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ అధ్యక్షులు మాట్లాడుతూ తమ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సనత్‌కుమార్ రెడ్డి, ఆడిటర్ రామ్మోహనరావు, వాసు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక వేదికల్లో రాజకీయ ప్రసంగాలు దురదృష్టకరం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఆధ్యాత్మిక వేదికల్లో స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి రాజకీయ ప్రసంగాలు చేయడం దురదృష్టకరమని జనసేన జిల్లా కార్యదర్శి అంజూరు చక్రధర్ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శివరాత్రి నిర్వహించిన స్వామి అమ్మవార్ల రథోత్సవంలో, అదే రోజు రాత్రి జరిగిన తెప్పోత్సవంలో ఎమ్మెల్యే రాజకీయ ప్రసంగాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేల మంది భక్తులతో శివనామ స్మరణ చేయాల్సిన చోట రాజకీయాలు మాట్లాడడం భక్తుల మనోభావాలు మనోభావాలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

పెట్రోల్, డీజల్‌ను జీఎస్‌టీ పరిధిలోకి తెండి..

- ఆ జీవోలను వెంటనే ఉపసంహరించుకోవాలి
- ఆటో స్టాండ్ ప్రారంభోత్సవంలో సీఐటీయూ నేతల వ్యాఖ్య
- అట్టహాసంగా జెండా ఆవిష్కరణ



సీఐటీయూ ఆటో స్టాండు ప్రారంభిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ఓజిలి: పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న జీవో నెంబర్ 21, 31, 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని, డ్రైవర్లను జైలు పాలు చేసే ప్రమాదకరమైన "హిట్ అండ్ రన్" సెక్షన్ 106(1)(2)లను వెంటనే రద్దు చేయాలని, వాటి వల్ల డ్రైవర్ల కుటుంబాలు వీధి పాలు పడే అవకాశం ఉందని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బివి.రమణయ్య, తంజావూరు మురళి పేర్కొన్నారు. ఓజిలి బస్టాండు సమీపంలో ఆదివారం సీఐటీయూ ఆటో స్టాండ్ అధ్యక్షులు ఎస్‌కె మహబూబ్ బాషా ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేశారు. కాగా అట్టహాసంగా సీఐటీయూ జెండా ఆవిష్కరణ చేపట్టారు. జిల్లా కార్యదర్శి తంజావూరు మురళి మాట్లాడుతూ ఏపీలో లీటర్ డీజల్ ధర రూ.98 ఉంటే పక్కనే ఉన్న కర్ణాటకలో రూ.88 మాత్రమే ఉందని. రూ.10 మన ప్రభుత్వం అధికంగా వసూలు చేస్తూ వాహన మిత్ర ఆటో డ్రైవర్లకు అందరికీ ఇస్తున్నట్లు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. వందలో 30 మందికి మాత్రమే వాహన మిత్ర అందడం జరుగుతోందన్నారు. లైసెన్సు కలిగిన ప్రతి డ్రైవర్‌కు వాహన మిత్ర అందజేయాలని, అలాగే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్టాండు ఉపాధ్యక్షులు ఓజిలి భాస్కర్, కార్యదర్శి నూర్ బాషా కాలేషా, సహాయ కార్యదర్శి జంషీద్ అహ్మద్, ట్రెజరర్ సాయిప్రసాద్, జిల్లా కమిటి సభ్యులు బి.రమేష్, మార్కెట్ స్టాండ్ నాయకులు బి.పెంచలయ్య, కోటయ్య, కమిటీ సభ్యులు శ్రీనివాసులు, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలగుంట చెరువా..? చెవిరెడ్డి ఎస్టేటా..?

- చెరువులో ఆక్రమణలు తొలగించండి
- ఎమ్మెల్యే చెవిరెడ్డిపై చర్యలు తీసుకోవాల్సిందే..
- రాష్ట్ర ఓబిసి కన్వీనర్ సుధాయాదవ్ డిమాండ్

ప్రజాశక్తి-రామచంద్రాపురం(తిరుపతిరూరల్): వ్యవసాయానికి సాగునీటిని అందించే తుమ్మలగుంట చెరువు ఆక్రమణలకు గురై ప్రజాధనంతో సుందరీకరణ చేసి ఆటస్థలం, వినోద, విహారయాత్ర స్థలంగా మార్చేశారు. దీంతో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయి సాగునీటికి తాగునీటికి తుమ్మలగుంట ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. తుమ్మలగుంట చెరువును పూర్తిగా చెవిరెడ్డి ఎస్టేట్‌ను తలపిస్తున్నదని రాష్ట్ర ఓబిసి కన్వీనర్ బడి సుధాయాదవ్ విమర్శించారు. ఆదివారం తుమ్మలగుంట చెరువును ప్రజా సంఘాలు, మేధావులతో కూడిన బృందంతో పరిశీలించారు. నేటిపారుదల శాఖ అధికారులు తన ఆధీనంలో ఉన్న చెరువును ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అధికారాన్ని అడ్డం పెట్టుకుని చెరువు రూపురేఖలు మార్చేస్తుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అది తుమ్మలగుంట చెరువా..? లేక చెవిరెడ్డి ఎస్టేటా అని ఆశ్చర్యం కలుగుతున్నదని ఆయన పేర్కొన్నారు. సాగునీటి చెరువులో ఆధునీకరణ పేరుతో ప్రజా ధనమైన తుడా నిధులను కోట్లాది రూపాయలను ఎమ్మెల్యే చెవిరెడ్డి దుర్వినియోగం చేశారని విమర్శించారు. గ్రీన్ ట్రిబ్యునల్ చెరువులో ఆక్రమణలు తొలగించి, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని



తుమ్మలగుంట చెరువును పరిశీలిస్తున్న బడిసుధాయాదవ్

ఆదేశించినప్పటికీ జిల్లా అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని నిలదీశారు. వెంటనే చెవిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని, చెరువులో ఆక్రమణలు తొలగించి చెరువును చెరువుగా ఉండేలా చూడాలని కోరారు. సాగునీటి చెరువులో కోట్లాది రూపాయలతో ఎస్టేట్లో మారుస్తున్నప్పటికీ నీటిపారుదలశాఖ అధికారులు ఏం చేస్తున్నారని నిలదీశారు. అనవసరంగా తుడా నిధులను దుర్వినియోగం చేసిన అధికారులు ప్రజాప్రతినిధులపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అధికారులు పేదలకు ఒక న్యాయం.. పెద్దోళ్లకు ఒక న్యాయం చేస్తున్నారని విమర్శించారు.

ఊపిరితిత్తుల వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలి

- డాక్టర్ నరసింహులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: ఊపిరితిత్తులు వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ నరసింహులు పేర్కొన్నారు. ఆదివారం పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ భవనంలో అధ్యక్షులు కేఎల్ మూర్తి కార్యదర్శి మునికృష్ణ, గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవిరాజు, డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. డాక్టర్ నరసింహులు మాట్లాడుతూ దగ్గు ఎక్కువగా ఉన్నట్లయితే వెంటనే డాక్టర్లను సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని, మూడు రోజులు వరకు ఉన్నట్లయితే టీబీ పరీక్షలు చేయించుకోవాలని ఊపిరితిత్తులు వ్యాధులు ఉన్న వారు తరచుగా మందులు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు మురుగేష్ రెడ్డి, కే కుప్పయ్య శెట్టి, గుణశేఖర్ రెడ్డి, గోపికృష్ణ, వాకర్ సభ్యులు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమమే లక్ష్యం: గోపికృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-కోట: బీసీ కులాల్లో ఉన్న నిరుపేదలను అభివృద్ధి చేయడమే తమ లక్ష్యం అని బీసీ కులాల ఐక్యవేదిక అధ్యక్షులు మర్లపల్లి గోపికృష్ణ అన్నారు. ఆదివారం కోట మండలంలోని బిసి కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీల సమస్యలు ఏవైనా ఉంటే నేరుగా తమ కార్యాలయంకు సంప్రదించాలన్నారు. అంతేకాకుండా బీసీ కులాలకు సంబంధించిన ప్రతి ఒక్కరికి చేయూతను అందించాలనే లక్ష్యంతో కార్యాలయం నూతనంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నూతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కమిటీలు 11మంది సభ్యత్వం తీసుకోవడం జరిగింది. బీసీ కులాల్లో ఏదైనా ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి చేయూత, బీసీ పేద విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ, బీసీ వృద్ధులకు చేయూత, బీసీ కులంలో ఎవరైనా మృతి చెందితే అంత్యక్రియలకు చేయూత, అదేవిధంగా అనాథ పిల్లలకు చేయూతను అందించే విధంగా అజెండాను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బిసి కులాల అధ్యక్షులు మర్లపల్లి గోపికృష్ణ, ఇరగరాజా రవి, హరీష్, తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

అధునాతన వ్యాపార పోకడలు అవలంబించాలి: వీసీ



కార్యక్రమంలో ప్రముఖులు

ప్రజాశక్తి-క్యాంపస్: అధునాతన వ్యాపార పోకడలు అవలంబించాలని శ్రీ పద్మావతీ మహిళ విశ్వవిద్యాలయం వీసీ భారతి అన్నారు. ఆదివారం విశ్వవిద్యాలయంలో డిపార్ట్మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్మెంట్, ఐసీఎస్-ఎస్ఆర్ స్పాన్సర్ చేసిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ సంయుక్త ఆధ్వర్యంలో "ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ బిజినెస్ అండ్ ఎంటర్ప్రెన్యూర్షిప్ ఇన్ డిజిటల్ వరల్డ్", ఆదివారం సావేరి సెమినార్ హాల్లో ఘనంగా ముగిసింది. ఈ ఇంటర్నేషనల్ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహిళ వర్సిటీ విసి భారతి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ వ్యాపారం విజయవంతం కావాలంటే మనం మార్పులను స్వీకరించాలి, ఏ.ఐ వంటి అత్యాధునిక సాంకేతికతలను స్వీకరించడం చాలా ముఖ్యం అయితే కొత్త అంతర్దృష్టులను అన్వేషించాలన్నారు. సాంకేతికత, మానవ కేంద్రీకరణ మధ్య మనం సమతుల్యతను కలిగి ఉండాలని సూచించారు. ఈ ముగింపు సమావేశానికి గౌరవ అతిథిగా ఉన్నత విద్యా మండలి వైస్ చైర్ పర్సన్ ప్రొఫెసర్ పి.ఉమామహేశ్వరీదేవి హాజరయ్యారు. అసెంబ్లీని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలను అభివృద్ధి చేయడానికి భవిష్యత్తు కోసం నిబద్ధత అవసరం, దార్శనికత ఉండాలి. విద్యావంతులుగా మనం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం వారి సామర్థ్యాన్ని అన్‌లాక్ చేయవచ్చు. సృజనాత్మకతతో ఇన్నోవేషన్ మొదలవుతుందని, ఆ దిశగా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. ఉపాధ్యాయులుగా, ఫలితాలను మెరుగుపరిచే ఉత్సుకత, సృజనాత్మకతకు సంబంధించి విద్యార్థుల్లో మనస్తత్వాన్ని పెంపొందించాలన్నారు. డిజిటల్ మార్కెటింగ్ తో స్టార్టప్‌ను నడపడంపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో కాన్ఫరెన్స్ డైరెక్టర్ పోఫెసర్ జె.కాత్యాయనీ, ఎం.బి.ఎ విభాగం హెచ్ఓడి ప్రొఫెసర్ పి.విజయలక్ష్మి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సీడాప్- డిఆర్డిఏ ద్వారా అమలు చేస్తున్న దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన (డిడియు-జికేవై) పూర్వ విద్యార్థుల సమ్మేళనం మంగళవారం తిరుచానూరులోని పద్మావతి కన్వెన్షన్ సెంటర్‌లో జరుపుతున్నామని డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఏ.డి జ్యోతి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉమ్మడి జిల్లాలైన చిత్తూరు, కడప, నెల్లూరు, అనంతపురం, కర్నూలు, ప్రకాశం జిల్లాలకు సంబంధించి 2022-23, 2023-24 సంవత్సరానికి గాను డి.డి.యు-జి.కే.వై శిక్షణ పొంది వివిధ రంగాలలో ఉపాధి పొందిన పూర్వ విద్యార్థులు దాదాపు 600 మంది ఈ కార్యక్రమంలో పాల్గొని ఈ పథకం లబ్దిదారులుగా తమ జీవితంలో సాధించిన విజయాలను ఈ సమావేశంలో అందరితో పంచుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో సీడాప్ చైర్మన్ సాడి శ్యామ్ ప్రసాద్ రెడ్డి, అడ్వైజర్ గాది శ్రీధర్ రెడ్డి, సీడాప్ ముఖ్య నిర్వహణాధికారి ఎం.కె.వి శ్రీనివాసులు, ఆయా జిల్లాల డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్లు, సీడాప్ సిబ్బంది, ట్రైనింగ్ పార్టనర్లు తదితరులు పాల్గొంటారన్నారు.

ఐజేకే జిల్లా అధ్యక్షులుగా కృష్ణమూర్తి



నియామక పత్రాలను అందిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఇండియా జననాయక కచ్చి పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడుగా నెల్లూరు కృష్ణమూర్తిని నియమించినట్లు ఆ పార్టీ ఆలిండియా ఉపాధ్యక్షుడు టి.ఆనంద మురుగన్ తెలిపారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తమ పార్టీ సేవలను తమిళనాడు రాష్ట్రానికి పరిమితం కాకుండా దేశ వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని ప్రజలకు కులమతాలకతీతంగా సేవలు అందించాలనే లక్ష్యంగా జిల్లాల కమిటీని ఎంపిక చేయడం జరుగుతోందన్నారు. అందులో భాగంగా తిరుపతి జిల్లా అధ్యక్షుడుగా నెల్లూరు కృష్ణమూర్తి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పూలమునికృష్ణను నియమించినట్లు తెలిపారు. కొత్తగా పదవి బాధ్యతలు చేపట్టిన వారు జిల్లాలో ప్రజల సంక్షేమానికి కృషి చేయడంతో పాటు పార్టీ బలోపేతానికి కృషి చేస్తారన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శులకు నియమాక పత్రాలు అందించి అభినందించారు. ఈ విలేకరుల సమావేశంలో ఐజేకే ఆలిండియా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎన్.రమేష్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్నాథం, ఎం.శక్తి, డాక్టర్ ఆర్.గోపినాథ్, గీత, బండి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి-ఏర్పేడు: శ్రీకాళహస్తిలో మహాశివరాత్రి సందర్భంగా జరుగు బాల్యవివాహాలను నిర్మూలించడంలో ప్రగతి స్వచ్ఛంద సంస్థ గత 15సంవత్సరాలుగా కృషి చేస్తున్నది. దీనిలో భాగంగా బాల్యవివాహాల నిర్మూలన కొరకు బండారుపల్లి, వెంకటపాలెం, చింతలపాలెం, పోతుమాను గుంట, పల్లం గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ప్రగతి సంస్థ మండల కోఆర్డినేటర్ గుండ్లపల్లి శిరీష మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. చట్టం ప్రకారం అమ్మాయిలు 18 సంవత్సరాలు, అబ్బాయిలు 21సంవత్సరాలు వచ్చే వరకు పెళ్లి చేసుకోకూడదు అని తెలిపారు. చట్టం ప్రకారం పెళ్లి వయసు రాని పిల్లలకు పెళ్లిళ్లు చేసిన లేక పెళ్లి ప్రయత్నాలు చేసిన ఎడల వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. బాల్యవివాహాల వలన పిల్లల భవిష్యత్తు నాశనం అవుతుందని తెలిపారు. చిన్న వయసులో పెళ్లిళ్లు చేయడం వలన ఆడపిల్లలు అనారోగ్యం పాలవుతారని తెలిపారు. మహిళ సంరక్షణ కార్యదర్శి మాట్లాడుతూ ఆడపిల్లలు ధైర్యంగా ఉండాలని తెలిపారు. టోల్ ఫ్రీ నెంబర్స్ 1098 చైల్డ్ లైన్ లేదా 100నెంబర్‌కి ఫోన్ చేసి వారి సమస్యలను తెలపవచ్చని చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ టీచర్లు, ఎస్‌సివి మెంబర్లు, సిబిఓ మెంబర్లు, వార్డ్ మెంబర్లు, అంగన్వాడి టీచర్లు, సచివాలయం స్టాఫ్, ప్రగతి సిబ్బంది, వెంకటేష్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి: భాను


ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: టీడీపీ అభివృద్ధికి ప్రతి నాయకుడూ, కార్యకర్తా శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఆ పార్టీ నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని స్థానిక కార్వేటినగరం రోడ్డు కళ్యాణపురం వద్ద పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు జీవరత్నంనాయుడు, ధనపాల్, మాధవయ్య, షణ్ముగంరెడ్డి, మాధవనాయుడు, యుగంధర్, కరుణాకరన్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: యువతలో ఓటు హక్కు పై అవగాహన పెంచ డం, 18 సంవత్స రాలు నిండిన వారు తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకో వడం, ఎన్నికల్లో ఓటు హక్కును స్వేచ్ఛగా వినియో గించుకోవాలనే అంశంపై ఏఈఆర్వో, కమిషనర్ డా. జె అరుణ ఆధ్వర్యంలో చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో ఓటరు చైతన్య అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఈసీఐ, కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు స్వీప్ (ఎస్‌విఇఇపి) కార్యక్రమాల్లో భాగంగా యువ ఓటర్లు ఎక్కువగా ఉండే ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో బాహుబలి సెల్ఫీ కటౌట్లను ఏర్పాటు చేశారు. ఓటర్ గుర్తింపు కార్డును భుజాలపై ఎత్తుకున్న బాహుబలి సెల్ఫీ కటౌట్లు యువతను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. యువత ఉత్సాహంగా సెల్ఫీలు, ఫొటోలు దిగుతూ తాము తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకుంటామని చెప్తున్నారు. తొలి ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవడానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నట్లు చెప్తున్నారు.

తిరుమలలో చిన్నారి మిస్సింగ్

ప్రజాశక్తి-తిరుమల: తిరుమలలో ఓ చిన్నారి మిస్ అయిన సంఘటన ఆదివారం కలకలం రేపింది. యాత్రికుల వసతి సముదాయం-2 వద్ద చిన్నారి మిస్సింగ్ అయినట్లు తెలుస్తోంది. తెలంగాణ రాష్టం గద్వాల్‌కి చెందిన 3 సంవత్సరాల బాలుడు అభినయ్‌ని గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారు. చిన్నారి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు, భద్రతా సిబ్బంది సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా గాలింపు చేపడుతున్నారు. కాగా పలు బృందాలు ఇప్పటికే వివిధ చోట్ల గాలిస్తున్నట్లు సమాచారం ఉంది. కాగా మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు తిరుమల టూటౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు.



రేపు టిటిడి విశ్రాంతి ఉద్యోగులకు ప్రొసిడింగ్స్ అందజేత

- ఉద్యోగుల కల నెరవేరింది: ఆంజనేయులు



ఆంజనేయులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): టీటీడీలో భక్తుల సేవే పరమావధిగా సేవలందించే ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు మేలు చేసే విధంగా టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఇళ్ల స్థలాల కేటాయింపును దసలవారీగా జరుపుతున్నారని టిటిడి ఉద్యోగుల జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు ఆంజనేయులు ఓ ప్రకటనలో తెలిపారు. ఇన్నేళ్లుగా టీటీడీలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి తమ చిరకాల కోరికగా ఇంటి స్థలం మంజూరును కోరుకున్నారని, ఆ కల సాకారం టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి వలన సాధ్యమైందన్నారు. మంగళవారం 12న మహతి కళాక్షేత్రం వేదికగా టిటిడిలో పని చేస్తూ పదవీ విరమణ పొందిన వారికి, ఫ్యామిలీ పెన్షనర్లకు ఏర్పేడు-వెంకటగిరి మార్గంలోని పల్లం గ్రామ పరిధిలో భూ కేటాయింపు చేస్తూ ప్రొసీడింగ్స్ ఆర్డర్లను లబ్ధిదారులకు అందజేయనున్నారన్నారు. టీటీడీ ఈవో ఏవి.ధర్మారెడ్డి, జేఈఓ వీరబ్రహ్మం విశ్రాంత ఉద్యోగులకు అందాల్సిన ఇళ్ల స్థలాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. మూడవసారి ఇళ్ల ప్రొసీడింగ్స్ అందుకోవడానికి వచ్చే వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఏర్పాట్లు చేసామన్నారు.

పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేత



స్కాలర్‌షిప్ అందుకున్న విద్యార్థులు

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: అప్తా ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఆదివారం స్కాలర్షిప్పు పంపిణీ చేశారు. తిరుచానూరులోని సంస్కృతి జూనియర్ కాలేజీలో ఆప్తా (అమెరికన్ ప్రోగ్రెస్సివ్ తెలుగు అసోసియేషన్) ద్వారా తిరుపతి జిల్లాలోని పేద బలిజ విద్యార్థులకు (35మందికి) స్కాలర్షిప్ ద్వారా సుమారు రూ.5.60లక్షల విలువ గల చెక్‌లను అందజేయడం జరిగింది. కార్యక్రమానికి మహిళా యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ భారతి, శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీ.జీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణమ్మ, ఎస్వీ అగ్రికల్చరల్ యూనివర్సిటీ మాజీ డీన్ హరిబాబు, బిసినెస్ మెన్ కొట్టే రాజగోపాల్, పద్మావతి విద్యా సంస్థల ఛైర్మెన్ సులోచనమ్మ, బోత్ హాస్పిటల్స్ ఛైర్మెన్ పసుపులేటి హరిప్రసాద్, చైర్ పర్సన్ ముఖ్యఅతిథులుగా పాల్గొని విద్యార్థులకు స్కాలర్షిప్స్ అందజేయడం జరిగింది. కార్యక్రమాన్ని డాక్టర్ మురళి కొణిదిన, శ్రీనివాసులు అరిగెల, మెండ్రి చిరంజీవి, తోట మధు, రెడ్డిబాబు, కిరణ్, సుమన్ వీరిశెట్టిల ఆధ్వర్యంలో నిర్వహించారు.

టీడీపీలో పలువురి చేరిక



టీడీపీలో చేరుతున్న పలువురు నాయకులు

ప్రజాశక్తి-గూడూరుటౌన్: టీడీపీలోకి వరుసగా పలువులు చేరుతున్నారు. ఆదివారం పట్టణంలోని అశోక్‌నగర్‌లోని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ నివాసంలో ఇందిరానగర్‌కు చెందిన వెంకటేశ్వర్లునాయుడుతో పాటు మరో 25కుటుంబాలు టీడీపీలో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్ రెడ్డి, పెంచలయ్య, సురేంద్ర పాల్గొన్నారు.

కనుమూరికి స్వాగతం..

పట్టణంలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ మాజీ ఛైర్మన్ కనుమూరు హరిశ్చంద్రరెడ్డి ఇటీవల టీడీపీలో చేరారు. ఆదివారం ఆయన పట్టణపార్టీ కార్యాలయానికి విచ్చేశారు. కాగా ఆయనకు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, పలువురు టీడీపీ నాయకులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లురాజు, నరసింహనాయుడు, చంద్రమౌళి, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరుటౌన్: టీడీపీ నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను సమక్షంలో ఆదివారం పట్టణంకి చెందిన కోలా సుధాకర్, జలకం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో సుమారు 100మంది టీడీపీ పార్టీలో చేశారు. వారికి గాలి భాను కండువా కప్పి స్వాగతం పలికారు. నాయకులు జీవరత్నంనాయుడు, ధనపాల్, మాధవయ్య, యుగంధర్, షణ్ముఖరెడ్డి, మాధవనాయుడు పాల్గొన్నారు.



గాలి భాను సమక్షంలో పార్టీలో చేరుతున్న యువకులు



నాని సమక్షంలో టీడీపీలో చేరుతున్న నాయకులు

రామచంద్రాపురం, తిరుపతిసీటీ: తిరుపతి రూరల్ మండలం పాడిపేట, గోవిందపురం, పాడిపేట హరిజనవాడ గ్రామాలలోని వైసిపి సానుభూతి పరులు ఆదివారం టిడిపిలో చేశారు. తనపల్లి క్రాస్‌లోని టిడిపి పార్టీ కార్యాలయంలో ఆదివారం 100కుటుంబాలు టీడీపీ చంద్రగిరి ఇన్‌ఛార్జ్ పులివర్తి నాని సమక్షలో పార్టీలో చేరారు. వారికి నాని కండువాలు కప్పి ఆహ్వానించారు. పవన్, పద్మనాభ రెడ్డి, గురువారెడ్డి, వాసు, మహేష్, శీను, నాగేశ్వరరావు, రూప్‌నాథ్, నవీన్‌లు చేరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మా భూమిని ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి: శ్రీనివాసులు



మాట్లాడుతున్న శ్రీనివాసులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మాకు స్వయార్జితంగా వచ్చిన శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం, తొట్టంబేడు గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 282/2, 3లో గల మూడు ఎకరాల 56సెంట్లు భూమిని శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన వైసిపి నాయకుడు చంద్రశేఖర్ ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని అతనిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు శ్రీనివాసులు సంబంధిత అధికారులను కోరారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తమకు పిత్రార్జితంగా వచ్చిన భూమిని 2004లో తన తండ్రి గంగయ్య మరణానంతరం భూమికి సంబంధించి రెవెన్యూ అధికారులకు మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న పట్టించుకోవడం లేదన్నారు. ఈ క్రమంలో కోర్టును ఆశ్రయించామన్నారు. కోర్టు ఈనెల 5వ తేదీ ఇన్ ట్రీమ్ ఆర్డర్ జారీ చేసిందన్నారు. అయినా శనివారం ఉదయం చంద్రశేఖర్ అనే వ్యక్తి దౌర్జన్యంగా తమ స్థలంలోకి ప్రవేశించాడన్నారు. కోర్టు ఉత్తర్వులను గౌరవించని చంద్రశేఖర్‌పై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ధర్మయ్య పాల్గొన్నారు.